క్లుప్తంగా

విద్యార్థులకు యూనిఫాం పంపిణీ



పరకాల: పరకాల జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో జాతీయ జెండాను ప్రధానోపాధ్యాయురాలు బి.మాధవి ఆవిష్కరించారు. విద్యార్థులకు ప్రభుత్వం అందించిన యూనిఫాంను స్థానిక కౌన్సిలర్ మడికొండ సంపత్‌కుమార్ చేతుల మీదుగా అందజేశారు. అనంతరం బడిబాట కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు బి.విద్యాసాగర్, ఎ.శ్రీనివాస్, డి.సదయ్య, డీబీ.స్వామి, కె.పద్మ, సారంగపాణి, నాగరాజు, విద్యార్థులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి బియ్యం అందజేత



శాయంపేట: ఇటీవల మృతిచెందిన మండల కేంద్రానికి చెందిన బత్తిన సరోజన, దైనంపల్లి సారయ్య కుటుంబాలను శాయంపేట ఎంపీటీసీ జమున, ఉపసర్పంచ్ సుమన్ శుక్రవారం పరామర్శించారు. బాధిత కుటుంబాలకు క్వింటా చొప్పున బియ్యం అందించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు పాడిశెట్టి గణేష్, మారపల్లి మోహన్, బత్తుల కార్తీక్, దైనంపల్లి కరుణ్, అల శ్రీధర్, ఇమ్మడి శెట్టి శ్రీనివాస్, మెరగత్తి కరుణాకర్, పులిచెరు నరేందర్, దైనంపల్లి శివ, గాజే రాజేందర్ పాల్గొన్నారు.

తాటివనంలో అగ్ని ప్రమాదం

నడికూడ: మండలంలోని రాయపర్తి గ్రామంలో శుక్రవారం మధ్యాహ్నం ఊర చెరువు వద్ద ఉన్న తాటివనంలో మంటలు చెలరేగాయి. స్థానికుల సమాచారం మేరకు అగ్నిమాపక సిబ్బంది అక్కడికి చేరుకొని స్థానికుల సహాయంతో మంటలు ఆర్పారు. ఈ ఘటనలో 50మంది గీత కార్మిక కుటుంబాలు రోడ్డున పడ్డాయని గౌడ కులస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఆదుకోవాలని రాయపర్తి గౌడ సంఘం అధ్యక్షుడు మార్క తిరుపతి గౌడ్, బీసీ సంక్షేమ సంఘం మండల ఉపాధ్యక్షుడు రాఘుపతి గౌడ్ కోరారు.

మాజీ మంత్రి పురుషోత్తమరావుకు సన్మానం

కాజీపేట అర్బన్: తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో తెలంగాణ కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో మాజీ మంత్రి టి.పురుషోత్తమరావును లోక్‌సభ మాజీ స్పీకర్ మీరాకుమారి శుక్రవారం సన్మానించారు. తెలంగాణ తొలి, మలి దశ ఉద్యమాల్లో పురుషోత్తమరావు క్రియాశీలక పాత్ర పోషించారని మీరా కుమారి గుర్తుచేశారు. ఈ కార్యక్రమలో మాజీ మంత్రులు చిన్నారెడ్డి, పొన్నం ప్రభాకర్, హన్మంతరావు, నాయకులు రంగారావు, డాక్టర్ కొట్టె భాస్కర్, చంద్రమౌళి, ఉదయభానురావు తదితరులు పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్ కార్యాలయం ఏర్పాటు చేయాలి

ఖిలా వరంగల్: వరంగల్ జిల్లా రిజిస్ట్రేషన్ కార్యాలయం హనుమకొండలో ఉందని, ప్రజల సౌకర్యార్థం జిల్లా రిజిస్ట్రేషన్ కార్యాలయాన్ని వరంగల్ తూర్పులో ఏర్పాటు చేయాలని వరంగల్ సామాజిక న్యాయవేదిక ప్రధాన కార్యదర్శి అచ్చ వినోద్‌కుమార్ డిమాండ్ చేశారు. ఈమేరకు వరంగల్ 39వ డివిజన్ విద్యానగర్ కాలనీలో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వరంగల్‌లో హనుమకొండ ఆర్టీఏ కార్యాలయం ఉంటే అక్కడి నాయకులు పట్టుబడి తరలించుకపోయారని గుర్తుచేశారు. ఈక్రమంలో ఐనవోలు మండల పరిధి గ్రామాల ప్రజల వాహన రిజిస్ట్రేషన్ కోసం వరంగల్ నగరం మీదుగా హనుమకొండ చింతగట్టుకు క్యాంప్‌కు వెళ్లాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అజీమ్ ప్రేమ్‌జీ యూనివర్సిటీకి గురుకుల విద్యార్థిని

కాజీపేట అర్బన్: హనుమకొండ హంటర్‌రోడ్డులోని తెలంగాణ సాంఘిక సంక్షేమ మహిళా గురుకుల డిగ్రీ కళాశాల విద్యార్థిని సౌజన్య.. బెంగుళూరులోని అజీమ్ ప్రేమ్‌జీ యూనివర్సిటీలో ఎంఏ కోర్సు చదివేందుకు ఎంపికైనట్లు డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ భద్రకాళి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ సాంఘిక సంక్షేమ డిగ్రీ కళాశాలలో బీఏ పూర్తి చేసిన సౌజన్య.. ఎంఏ కోర్సుకు అజీమ్ ప్రేమ్‌జీ యూనివర్సిటీకి ఎంపికకావడం అభినందనీయమని పేర్కొన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

హసన్‌పర్తి: చింతగట్టు సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంలో స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో శనివారం విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఏఈ ప్రదీప్‌కుమార్ తెలిపారు.

పరకాల: జెండాకు వందనం చేస్తున్న ఎమ్మెల్యే ధర్మారెడ్డి, తదితరులు



ఐనవోలులో ఎంపీపీ మార్నేని మధుమతి, తదితరులు



శాయంపేట తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ రాజు



ఘనంగా తెలంగాణ ఆవిర్భావ వేడుకలు

తెలంగాణ అవతరణ దినోత్సవాన్ని జిల్లా వ్యాప్తంగా ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. రాష్ట్రం వచ్చి తొమ్మిదేళ్ల పూర్తయిన సందర్భంగా దశాబ్ది ఉత్సవాలను ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజా సంఘాల నాయకులు శుక్రవారం నిర్వహించారు. ఈమేరకు జాతీయ జెండాలను ఆవిష్కరించారు. రాష్ట్ర సాధనలో అసువులు బాసిన అమరుల త్యాగాలను గుర్తుచేసుకున్నారు. కాగా, 21రోజుల పాటు వేడుకలు జరగనున్నాయి. - సాక్షి నెట్‌వర్క్



కమలాపూర్: తహసీల్దార్ కార్యాలయంలో..



దామెర: జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్న ఎంపీపీ శంకర్



ఎల్కతుర్తి: పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై పరమేష్



ఆత్మకూరు : జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న తహసీల్దార్ సురేష్‌కుమార్



పరకాలలో కాంగ్రెస్ నాయకులు



శాయంపేట: సోనియాగాంధీ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తూ..



దామెరలో సోనియాగాంధీ చిత్రపటానికి క్షీరాభిషేకం



ధర్మసాగర్: జాతీయ జెండాకు వందనం చేస్తున్న తహసీల్దార్ రజిని



ఆత్మకూరులో క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు



కమలాపూర్‌లో..



ధర్మసాగర్‌లో..

ఏఎస్సై సంపత్‌కు ఉత్తమ అవార్డు



సంపత్‌ను అభినందిస్తున్న సీపీ రంగనాథ్

ఎల్కతుర్తి : ఉత్తమ సేవలందించినందుకు భీమదేవరపల్లి మండలం ముల్కనూర్ పోలీస్ స్టేషన్ ఏఎస్సై కటకం సంపత్ సీపీ రంగనాథ్ చేతుల మీదుగా శుక్రవారం అవార్డు అందుకున్నారు. తెలంగాణ అవతరణ దినోత్సవం సందర్భంగా అవార్డు ప్రదానం చేశారని ఏఎస్సై సంపత్ తెలిపారు. కాజీపేట ఏసీపీ శ్రీనివాస్, సీఐ ప్రవీణ్‌కుమార్, ఎస్సై మహేందర్ తదితరులు సంపత్‌కు అభినందనలు తెలిపారు.

రెజ్లర్లకు న్యాయం చేయాలి



దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

కమలాపూర్ : మహిళా రెజ్లర్లకు న్యాయం చేయాలని సేవ్ డెమోక్రసీ నాయకుడు ఉప్పుల శివ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం కమలాపూర్‌లో సేవ్ డెమోక్రసీ నాయకులు ధర్నా చేశారు. అనంతరం ప్రధాని నరేంద్రమోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓ బీజేపీ ఎంపీ వేధించాడని రెజ్లర్లు ఆందోళన చేసినా కేంద్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. నిందితుడు బ్రిజ్ భూషణ్‌ను వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. మహిళా రెజ్లర్లకు న్యాయం చేయకపోతే ఊరుకోమని హెచ్చరించారు. ఆందోళనలో సేవ్ డెమోక్రసీ నాయకులు పాల్గొన్నారు.

రైతు దినోత్సవాన్ని విజయవంతం చేయాలి

ఐనవోలు: తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా రైతు వేదికల వద్ద శనివారం నిర్వహించనున్న రైతు దినోత్సవ ఉత్సవాలకు రైతులు భారీగా తరలివచ్చి విజయవంతం చేయాలని ఏఓ కవిత శుక్రవారం ఓ ప్రకటనలో కోరారు. మండలంలోని రాంనగర్, ఐనవోలు, పంథిని, కొండపర్తి, గర్మిళ్లపెల్లి రైతు వేదికల వద్ద ఏర్పాట్లు పూర్తయినట్లు చెప్పారు. క్లస్టర్ల వారీగా ప్రజా ప్రతినిధులు, రైతులు ఎడ్లబండ్లు, ట్రాక్టర్లతో భారీగా తరలిరావాలని పేర్కొన్నారు. ఉదయం గంటలు 10.30 నుంచి 2.30 వరకు కార్యక్రమాలు కొనసాగిన అనంతరం సామూహిక భోజనాలు ఉంటాయని తెలిపారు.

కొఠారి కమిషన్‌ను అమలు చేయాలి



మాట్లాడుతున్న బొడ్డు భరత్

ధర్మసాగర్: కొఠారి కమిషన్‌ను అమలు చేయాలని జన పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు బొడ్డు భరత్ కోరారు. మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో తెలంగాణ ఆవిర్భావ వేడుకలను శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ భవిష్యత్తు తరగతి గదుల్లో రూపుదిద్దుకుంటుందని, అలాంటి విద్య నేడు అంగడి సరుకుగా మారిందని, చదువు కొనుక్కునే దుస్థితి నేడు దాపురించిందని ఆందోళన వ్యక్తం చేశారు. విద్య ద్వారా ఉపాధి జీవన విలువలు పెంపొందించి జీవితంపై నమ్మకం ఏర్పడే విధంగా విద్యా వ్యవస్థను ప్రభుత్వాలు రూపొందించాలని సూచించారు. మన ఊరు – మన బడి కార్యక్రమం మొక్కుబడిగా కాకుండా ప్రజల్లో నమ్మకం, విశ్వాసం కలిగే విధంగా రాజకీయ ప్రవేశం తగ్గించి ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర స్కావెంజర్, వాచ్‌మెన్, పర్యవేక్షణ అధికారులను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశాడు. బడుల్లో మౌలిక సదుపాయాలు, మధ్యాహ్న భోజన పథకంలో భాగంగా స్నాక్స్ పాలు, పౌష్టిక ఆహారం అందించాలని కోరారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఉమామహేశ్వర్, విద్యా కమిటీ చైర్మన్ చిలుక సదానందం, ఉపాధ్యాయులు ధర్మప్రకాష్, సురేష్, శ్రీదేవి, రాజమ్మ, కిరణ్మయి, పద్మజ, అనిత, ప్రసన్న, సునీత తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ నాయకులు అంబేడ్కర్‌ను గౌరవించలేదు



అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న నాయకులు

ఐనవోలు: బీఆర్‌ఎస్ నాయకులు మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహానికి కనీసం పూలమాల కూడా వేయలేదని కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు సమ్మెట మహేందర్ ఆరోపించారు. తెలంగాణ అవరతరణ దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం పక్కనే బీఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో జాతీయ జెండాను శుక్రవారం ఆవిష్కరించారు. అయితే, పక్కనే ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి గౌరవించాలన్న కనీస విజ్ఞత కోల్పోయారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మాజీ పీసీసీ కార్యదర్శి మార్నేని వెంకటేశ్వర్‌రావు, నాయకులు కూస చిరంజీవి రెడ్డి, మేట చిరంజీవి, కొత్తూరి సునీల్, ఎండీ.రహీంపాషా, గ్యాదరి భాస్కర్, ఇల్లందుల ఎలిషా, కమలాకర్ రెడ్డి, కట్కూరి బాబు, గడ్డం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల సమస్యలు పరిష్కరించాలి

హన్మకొండ అర్బన్: వికలాంగుల సమస్యలు పరిష్కరించాలని వికలాంగుల నిరుద్యోగుల అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి బొట్ల సురేష్, వక్కల్ల రాజు డిమాండ్ చేశారు. నగరంలోని వడ్డెపల్లిలోని వికలాంగుల సంక్షేమ హాస్టల్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన సంఘం సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగ నియామకాల్లో శారీరక వికలాంగులకు ఉన్న 56వ రోస్టర్ పాయింట్‌ను 10లోపు ఉండే విధంగా సవరించాలని, ఆసరా పింఛన్‌ను రూ.6,016కు పెంచాలని, వికలాంగుల బ్యాక్ లాగ్ ఉద్యోగాలకు తక్షణమే భర్తీ చేయాలని సూచించారు. తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం ఈనెల 4న చేపట్టనున్న హలో వికలాంగ్.. చలో కలెక్టరేట్ ధర్నాలో ఉమ్మడి జిల్లాలోని వికలాంగులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షుడు శంకర్‌నాయక్, కోశాధికారి గణేష్, జాయింట్ సెక్రటరీలు శ్యామ్, ప్రసాద్ పాల్గొన్నారు.

నియామకాలకు దరఖాస్తుల ఆహ్వానం

కాశీబుగ్గ సెంటర్: జిల్లాలో చైల్డ్ హెల్ప్‌లైన్‌లో ఔట్ సోర్సింగ్ ప్రాతిపదికన ప్రాజెక్ట్ కో–ఆర్డినేటర్, కౌన్సిలర్, చైల్డ్ హెల్ప్‌లైన్ సూపర్‌వైజర్లు, కేస్ వర్కర్లుగా పనిచేసేందుకు అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు వరంగల్ జిల్లా సంక్షేమాధికారి ఎం.శారద ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు జూలై 1, 2023 నాటికి 21 నుంచి 35 ఏళ్ల మధ్య వయస్సు ఉండాలని, ఎస్సీ, ఎస్టీ, బీసీలకు ఐదేళ్ల సడలింపు ఉంటుందని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈనెల 13లోపు పబ్లిక్ గార్డెన్ ఎదురుగా, టీటీడీ కల్యాణ మండపం పక్కన ఉన్న జిల్లా సంక్షేమాధికారి కార్యాలయంలో అన్ని ధ్రువపత్రాలను గెజిటెడ్ ఆఫీసర్‌తో అటెస్టెడ్ చేయించి సమర్పించాలని సూచించారు.

సివిల్స్ ర్యాంకర్ సాయికిరణ్‌కు సన్మానం



సివిల్స్ ర్యాంకర్ సాయికిరణ్‌ను సన్మానిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

ఎల్కతుర్తి : సివిల్స్‌లో 460వ ర్యాంకు సాధించిన భీమదేవరపల్లి మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన పత్తిపాక సాయికిరణ్‌ను శుక్రవారం ఘనంగా సన్మానించారు. తెలంగాణ ఆవిర్భావ వేడుకల్లో భాగంగా ఎంపీడీఓ కార్యాలయంలో ఆయనకు అధికారులు, ప్రజాప్రతినిధులు శాలువా కప్పి సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ జక్కుల అనిత, ఎంపీడీవో భాస్కర్, ఎంఈవో వెంకటేశ్వర్‌రావు, ఎస్సై మహేందర్, ఏవో అఫ్జల్‌పాషా తదితరులు పాల్గొన్నారు.

కేయూలోని సమస్యలు పరిష్కరించాలి

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలో రెగ్యులర్ వీసీ నియామకం అయి రెండేళ్లు అయినా విద్యార్థులు, నాన్ టీచింగ్, ఉద్యోగులు, అధ్యాపకుల సమస్యలు పరిష్కరించడం లేదని, ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నాయని కాకతీయ యూనివర్సిటీ టీచర్స్ అసోసియేషన్ (అకుట్) ప్రధాన కార్యదర్శి డాక్టర్ మామిడాల ఇస్తారి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రతి ఆగస్టు 15, జనవరి 26న వేదికలపై యూనివర్సిటీ అధికారులు.. అందరి సమస్యలు పరిష్కరిస్తామని ప్రగల్భాలు పలుకుతున్నారే తప్ప పరిష్కారానికి కృషి చేయడం లేదని తెలిపారు. యూజీసీ నిబంధనల ప్రకారం అడ్జెంట్ ప్రొఫెసర్లను నియమించాల్సి ఉండగా నిబంధనలను పాటించకుండానే నియమకాలు చేశారని పేర్కొన్నారు.

ఘనంగా హిందూ సామ్రాజ్య దినోత్సవం



హిందూ సామ్రాజ్య దినోత్సవంలో పాల్గొన్న ఆర్‌ఎస్‌ఎస్ ప్రతినిధులు

ఆత్మకూరు : మండల కేంద్రంలో హిందూ సామ్రాజ్య దినోత్సవాన్ని ఆర్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా శివాజీ విగ్రహానికి పూలమాలల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆర్‌ఎస్‌ఎస్ సమరసత ప్రముఖ్ టింగిళికారి సత్యనారాయణ, మండల కార్యవాహ కందగట్ల విజయ్‌కుమార్, వంగాల బుచ్చిరెడ్డి, శ్రావణ్‌కుమార్, సాయిసేన్, నాగబండి శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



సమావేశంలో మాట్లాడుతున్న అశోక్‌రెడ్డి

కమలాపూర్: కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన సంక్షేమ పథకాలను జన సంపర్క్ అభియాన్ పేరుతో జూన్ 30వ తేదీ వరకు నెలరోజుల పాటు ప్రతీ పోలింగ్ బూత్ స్థాయిలో గడప గడపకు తీసుకెళ్లాలని కార్యకర్తలకు బీజేపీ కమలాపూర్ మండల అధ్యక్షుడు కట్కూరి అశోక్‌రెడ్డి సూచించారు. కమలాపూర్‌లో శుక్రవారం జరిగిన బీజేపీ మండల కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. 1,200 మంది అమరుల త్యాగాల పునాదుల మీద ఏర్పడిన తెలంగాణ రాష్ట్రం కేసీఆర్ కబంధ హస్తాల్లో బందీ అయిందని ఆరోపించారు. తెలంగాణ ప్రభుత్వం చేస్తున్న అన్యాయాలు, అక్రమాలు, దుర్మార్గపు అవినీతి పాలనను ప్రజలు సహించే పరిస్థితిలో లేరని అన్నారు. రానున్న ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీకి ప్రజలు గుణపాఠం చెప్పి బీజేపీని అధిక మెజార్టీతో గెలిపిస్తారని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి భూపతి ప్రవీణ్, కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి ర్యాకం శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు బండి కోటేశ్వర్, మండల ఉపాధ్యక్షులు బోగి భిక్షపతి, జనగాని కుమారస్వామి, సర్పంచ్ చేలిక శ్రీనివాస్, ఎంపీటీసీ ఇనుగాల రజిత, కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడు పెండ్యాల ప్రభాకర్‌రెడ్డి, మాజీ ప్రజాప్రతినిధులు వలిగె సాంబరావు, అర్వపెల్లి సామ్రాజ్యం, సోషల్ మీడియా కన్వీనర్ కొలిపాక తిరుపతి, నాయకులు పాల్గొన్నారు.

సేవాభావాన్ని పెంపొందించుకోవాలి

హన్మకొండ అర్బన్: ప్రతిఒక్కరూ సేవాభావాన్ని పెంపొందించుకోవాలని తెలంగాణ రాష్ట్ర రైతు రుణ విమోచన కమిషన్ చైర్మన్ నాగుర్ల వెంకటేశ్వర్లు సూచించారు. నగరంలోని మల్లికాంబ మనోవికాస కేంద్రంలో జరిగిన రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలకు శుక్రవారం హాజరై జాతీయ జెండా ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రార్థించే పెదాల కన్నా సేవ చేసే చేతులు మిన్న అనే మదర్ థెరిస్సా బాటలో మల్లికాంబ మనోవికాస కేంద్రం నిర్వాహకులు ఎంతోమంది దివ్యాంగులను చేరదీసి వారి ఆలనపాలన చూస్తున్నారని అభినందించారు. మనోవికాస కేంద్రానికి కావాల్సిన నిధులు సమకూర్చడానికి సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కుడా మాజీ చైర్మన్ మర్రి యాదవరెడ్డి, ఉమ్మడి వరంగల్ జిల్లా లయన్స్ క్లబ్ మాజీ గవర్నర్ రెంటాల కేశవరెడ్డి, జాయింట్ సెక్రటరీ పద్మ, కార్యవర్గ సభ్యులు సదానందం, కళ్యాణ్, మల్లికాంబ కేంద్ర నిర్వాహకులు పాల్గొన్నారు.

భూపతికి గుర్తింపు దక్కకపోవడం విచారకరం

వరంగల్: ప్రత్యేక తెలంగాణ ఉద్యమం కోసం అహర్నిశలు శ్రమించి తెలంగాణ గాంధీగా గుర్తింపు పొందిన దివంగత భూపతి కృష్ణమూర్తికి ప్రత్యేక రాష్ట్రంలో సరైన గుర్తింపు దక్కకపోవడం విచారకరమని చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ అధ్యక్షుడు బొమ్మినేని రవీందర్‌రావు ఆందోళన వ్యక్తం చేశారు. చాంబర్ కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకొని జాతీయ జెండాను శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చాంబర్‌లో జరిగిన సమావేశంలో వక్తలు మాట్లాడుతూ భూపతి కృష్ణమూర్తిని విస్మరించడం బాధాకరమన్నారు.